క్లుప్తంగా

సుబ్రహ్మణ్యస్వామికి విశేష పూజలు


సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధికంగా తరలివచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నేడు

పరవాడ: ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వగ్రామం రాంపురంలో బుధవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండలంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు విధిగా హాజరు కావాలని రామారావు కోరారు.

ఘనంగా పోలిపిల్లిమ్మ మారువారం పండగ


పోలిపిల్లిమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 98వవార్డు అప్పన్నపాలెంలో వేంజేసిన పోలిపిల్లిమ్మ మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. మహిళలు, భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పసుపుకుంకుమలు సమర్పించారు. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. అప్పన్నపాలెం, సింహపురికాలనీ, సింహపురిలేఅవుట్, పంచాయతీకాలనీ, వాంబే కాలనీ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ 98వవార్డు ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు పీతల అప్పలరాజు, జగదీష్, కె.సింహాద్రి,నక్క శ్రీను,సింహాచలం తదితరులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మూగజీవాలకు నీరు అందించాలి


సింహగిరిపై పక్షులకు నీరు పెడుతున్న సింగర్ నాగూర్‌బాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని మంగళవారం సినీ గాయకుడు మనో(నాగూర్ బాబు) దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగూర్‌బాబు మాట్లాడుతూ ఎండాకాలంలో మూగ జీవాలు, పక్షులకు నీరు అందడం చాలా కష్టమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ వాటికి నీటిని అందించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వాటర్ బర్డ్ ఛాలెంజ్‌ను సినీనటుడు రజనీకాంత్‌కు చేస్తున్నట్టు తెలిపారు.

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: క్రోధి నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని మంగళవారం బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మవారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా గణపతి పూజ, మండపారాధన నిర్వహించిన అనంతరం ఎస్‌వీఎస్ఆర్‌కే ప్రసాద్ పంచాంగం చదివి వినిపించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, పంచాంగ పుస్తకాలు వితరణ చేశారు.

సంక్షేమ పథం.. ప్రగతి రథం

- డీబీటీ కింద రూ.9.03 కోట్ల జమ
- నాన్ డీబీటీ కింద రూ.2.32 కోట్ల అందజేత
- మారిన ప్రజల ఆర్థిక పరిస్థితి
- అభివృద్ధి పనులకు రూ.4.69 కోట్ల ఖర్చు
- ప్రభుత్వ పనితీరుపై సర్వత్రా హర్షాతిరేకాలు

సచివాలయం	- ఆదిరెడ్డిపాలెం
సచివాలయ పరిధిలో జనాభా	- 3,000
ఓటర్లు	- 2,120
శివారు గ్రామాలు	- ఆదిరెడ్డిపాలెం, చిన్నయ్యపాలెం, గొల్లలపాలెం


నూతనంగా వేసిన బీటీ రోడ్డు


ఆదిరెడ్డిపాలెం గ్రామ సచివాలయం


వినియోగంలోకి వచ్చిన రైతు భరోసా కేంద్రం

సబ్బవరం: మండలంలోని ఆదిరెడ్డిపాలెం సచివాలయం పరిధిలోని ఆదిరెడ్డిపాలెం,చిన్నయ్యపాలెం,గొల్లలపాలెం ప్రగతి బాట పట్టాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తుంది. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. సంక్షేమ పథకాలతో చాలా మంది నిరుపేదలు ఆర్థికంగా నిలుదొక్కుకున్నారు.స్వయం ఉపాధి పొందుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హులకు పథకాలు అందాలంటే నాయకులు చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వమే వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి ఏయే పథకాలకు ఎవరు అర్హులో నిర్ధారించి వారి చెంతకే పథకాలు అందించింది.దీంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి మొత్తం
అమ్మ ఒడి	205	రూ.92,32,000
జగనన్న విద్యాదీవెన	201	రూ.74,89,164
జగనన్న వసతి దీవెన	149	రూ.24,56,944
రైతు భరోసా	334	రూ.1,50,44,800
పంటల బీమా	25	రూ.78,718
పంట రుణాల సున్నా వడ్డీ	20	రూ. 32,913
రైతుల ఇన్‌పుట్ సబ్సిడీ	09	రూ.24,120
వైఎస్సార్ పింఛన్ కానుక	262	రూ. 2,46,88,000
వైఎస్సార్ చేయూత	158	రూ.72,37,500

వైఎస్సార్ ఆసరా	476	రూ.1,67,65,434
సున్నా వడ్డీ	542	రూ. 13,02,246
ఈబీసీ నేస్తం	03	రూ.90,000
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	87	రూ. 23,80,632
వైఎస్సార్ ఆరోగ్య ఆసరా	47	రూ.2,94,375
వైఎస్సార్ హౌసింగ్ డీబీటీ	26	రూ. 13,58,719
వైఎస్సార్ బీమా	05	రూ.5,60,000
వాహన మిత్ర	23	రూ. 5,70,000
చేదోడు	06	రూ.1,80,000
కోవిడ్ సహాయం	538	రూ.5,38,000
జగనన్న తోడు	58	రూ.23,081

బతుకుకు భరోసా ఇచ్చారు



ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వైఎస్సార్ చేయూత కిందట ఏటా రూ.18,750 చొప్పున వస్తుంది. మూడు సంవత్సరాలుగా ఈ పథకం ద్వారా లబ్ధి పొందాను.ఈ సారి వస్తే నాలుగు సార్లు ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగానే రూ.75 వేలు చేతికి అందుతుంది.దీంతో పాటు గ్రామంలోని తేజశ్విని డ్వాక్రా గ్రూపులో ఉన్న నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా సంవత్సరానికి రూ.15 వేలు చొప్పున మూడు సంవత్సరాలు రూ.45 వేలు వచ్చింది. నా భర్త గొంప దేముడుకు రైతు భరోసా కూడా వస్తుంది. దీంతో హాయిగా జీవిస్తున్నాం.

– గొంప వరలక్ష్మి, ఆదిరెడ్డిపాలెం,సబ్బవరం

పేదల ప్రభుత్వం



నా భర్త, కుమారుడు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాం.ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంటి స్థలం పట్టా ఇచ్చింది.అనంతరం రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లు అందజేశారు.వీటితో పాటు రెండు సంవత్సరాలుగా రూ.18,750 చొప్పున చేయూత వస్తుంది. శ్రీబంగారమ్మ డ్వాక్రా గ్రూపులో ఉండడంతో మూడు సంవత్సరాలుగా ఆసరా కింద రూ.30 వేలు వచ్చింది.

– కామిరెడ్డి లక్ష్మి, ఆదిరెడ్డిపాలెం, సబ్బవరం

పింఛన్‌తో ధీమా



దివంగత నేత రాజశేఖరరెడ్డి ఉన్నప్పటి నుంచి పింఛన్ వస్తుంది.ఈ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రతి నెల వలంటీర్ పింఛన్ తెచ్చి ఇంటికి ఇస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెంచడంతో రూ.3 వేలు అందుతోంది. నాకు నలుగురు కుమారులు ఉన్నారు.అయినా పిల్లలపై ఆధార పడకుండా పింఛన్ సొమ్ముతో హాయిగా ఉంటున్నాం.నాకు రైతు భరోసా వస్తుంది.

– కామిరెడ్డి దేముడు, ఆదిరెడ్డిపాలెం, సబ్బవరం

మానవతా వాది సీఎం జగన్


బలిజపాలెంలో దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ తదితరులు

ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్

సబ్బవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కేవలం నాయకుడే కాదు..., గొప్ప మానవతావాది అని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ అన్నారు. మండలంలోని నారపాడు శివారు బలిజపాలెంలోని దుర్గాదేవి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు.ఈ ప్రాంతం అంతా ఆధ్యాత్మిక భావంతో వికసించాలని ఆకాంక్షించారు. కేవలం భక్తుల సహకారంతో ఆలయాన్ని నిర్మించిన మామిడి కొండాజీ, దుర్గారావులను అభినందించారు.ఇదే గ్రామంలో మరో గ్రామ దేవత పైడితల్లమ్మ ఆలయం నిర్మాణానికి కూడా వీరు ఇరువురు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణ ధర్మకర్తలు మామిడి కొండాజీ, దుర్గారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే అదీప్ రాజ్ సహకారంతో దుర్గాదేవి ఆలయం నిర్మించిన విధంగానే, పైడిమాంబ ఆలయాన్ని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. తమకు పూర్తి సహాయ సహకారాలు అందించిన సహకరించిన వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బయలుపూడి భగవాన్ జయరాం, సీనియర్ నాయకులు గండి రవికుమార్, కొటాన రాము,బోకం రామునాయుడు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, సబ్బవరపు నారాయణమూర్తి, పీఏసీఎస్ చైర్మన్ కాపుశెట్టి శేషుబాబు, ఎంపీటీసీ సభ్యుడు మామిడి కొండాజీ దంపతులు,పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు,దుర్గారావు, స్థానిక యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజానేత వైఎస్ జగన్

అనంతరం ఆలయం బయట అదీప్‌రాజ్ మీడియాతో మాట్లాడారు. ప్రజల కష్ట సుఖాలు తెలుసుకుని అవసరమైన సంక్షేమ పథకాల అమలు చేస్తూ ప్రజాభిమానం పొందుతున్న ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ అన్నారు. ప్రశాంత్ కిశోర్ లాంటి వాళ్లు ఎంత మంది ఎన్ని ఆరోపణలు చేసినా వైఎస్సార్‌సీపీ విజయ కేతనం ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అంతటా ఆధ్యాత్మిక శోభ


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి


పూజల్లో పాల్గొన్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో ఉగాది వేడుకలు
- ఆలయాలు కిటకిట

అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఉగాది పర్వదినం పురస్కరించుకుని సందడి నెలకొంది. స్త్రీ, పురుషులు సంప్రదాయ వస్త్రధారణలో మెరిశారు. ఇళ్లను మామిడి తోరణాలతో అలంకరించారు. తొలిపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని తమ ఇష్టదైవాలను దర్శించుకున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఏడాదంతా సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. ఉగాది పంచాంగం ఆలకరించారు.

పెందుర్తి: వెంకటాద్రిపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవ అనంతరం తోమాల సేవ జరిపారు. చందన అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం స్వామివారి సన్నిధిలో పంచాంగ శ్రవణం జరిగింది. అనంతరం నామ సంకీర్తనలు, పవళింపు సేవ చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పోటెత్తిన భక్తులు

పరవాడ: ఉగాది పర్వదినం సందర్భంగా ముత్యాలమ్మపాలెంలో కొలువుదీరిన ముత్యమాంబ ఆలయం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. మండలంలో వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నూతన సంవత్సరంలో అన్ని శుభాలు జరగాలని అమ్మవారిని భక్తులు వేడుకున్నారు. భక్తుల తాకిడిని ముందుగా గుర్తించలేని ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేయడంలో విఫలమైందని పలువురు భక్తులు వాపోయారు.

పరవాడ: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని పరవాడ గ్రామంలో మంగళవారం పురోహితులు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, గ్రామ పెద్దలు పైల హరీష్, రెడ్డి శ్రీనివాసరావు, పైడింనాయుడు, అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.


పరవాడలో పంచాంగ శ్రవణం చేస్తున్న పురోహితులు


ముత్యమాంబ ఆలయం వద్ద భక్తుల సందడి


అమ్మవారి దర్శనం కోసం క్యూలో భక్తులు

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


బాల త్రిపురసుందరిగా దర్శనమిస్తున్న లలితాంబిక


నవరాత్రుల్లో భాగంగా కలశస్థాపన చేసిన ఆహుతులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గోపూజతో ప్రారంభమైన ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు బాల త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆహుతులైన భక్తుల సమక్షంలో శ్రీమేరు మొదటి అంతస్తులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక మీద కలశ స్థాపన చేశారు.అనంతరం ఉత్సవ మూర్తి లలితాంబిక అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించి నూతన వస్త్ర, ఆభరణ అలంకరణ గావించారు.లలితా సహస్రనామ పారాయణ,త్రిశతి,బాలా సహిత లలితా హోమం జరిపించారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనను గురుమాత అన్నపూర్ణమ్మ ప్రారంభించారు.

11 నుంచి మండలంలో అదీప్‌రాజ్ ప్రచారం

పరవాడ: పెందుర్తి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఈ నెల 11 నుంచి మండలం ముత్యాలమ్మపాలెంలో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. తొలుత ముత్యమాంబ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

ఎన్నికల ప్రచార షెడ్యూల్

తేదీ	సమయం	గ్రామం
11న	సా: 4 గంటలు	ముత్యాలమ్మపాలెం
12	ఉ: 7 గంటలు	నాయుడుపాలెం
13	ఉ: 7 గంటలు	తిక్కవానిపాలెం
14	ఉ: 7 గంటలు	భర్నికం
	సా: 4 గంటలు	తానాం
15	ఉ:7 గంటలు	ఈ.బోనంగి
	సా: 4 గంటలు	రావాడ
16	ఉ: 7 గంటలు	కన్నూరు
	సా: 4 గంటలు	పెదముషిడివాడ

నృసింహుడికి విశేష పూజలు


నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఉగాది పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేసి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం 1001నామాలను పఠిస్తూ స్వామికి అర్చన చేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం అనంతరం కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.
- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో గరుడవాహనంపై గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అర్చకుడు కుమారాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

కేంద్ర ప్రభుత్వం దిగి రావాల్సిందే..


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు కార్మికులు పట్టు వదలక చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగిస్తామనే ప్రకటన చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1153వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఈ విధంగా ప్రభుత్వరంగ సంస్థలను అమ్ముకుంటూ పోతే భారతదేశంలో ఏ ప్రభుత్వరంగ సంస్థా మిగలదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

24 మద్యం సీసాల స్వాధీనం

పరవాడ: తిక్కవానిపాలెం గ్రామానికి చెందిన చింతకాయల మహేష్ అక్రమంగా తరలిస్తున్న 24 మద్యం (180 ఎంఎల్) సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు పరవాడ ఎస్ఐ టి.మల్లేశ్వరరావు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

బూడిద లారీలతో బెడద


ఫ్లైయాష్ లారీల నుంచి రోడ్డుపై పడిన బూడిద

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ నుంచి లంకెలపాలెం-సబ్బవరం మీదుగా రాకపోకలు సాగిస్తున్న బూడిద లారీలతో అనేక గ్రామాల ప్రజలు నరయాతన అనుభవిస్తున్నారు. సింహాద్రి ఎన్టీపీసీ ఫ్లైయాష్ చెరువుల నుంచి లంకెలపాలెం మీదుగా ప్రయాణించే బూడిద లారీల నుంచి తడి, పొడి బూడిద రోడ్లపై రాలుతోంది. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మరో వైపు బూడిద గాల్లో కలిసి పోవడంతో కళ్లు, గొంతు మంటలు, శ్వాసకోశ వ్యాధుల పాలవుతున్నామని అనేక గ్రామాల ప్రజలు, ప్రయాణికులు వాపోతున్నారు. అధిక లోడ్‌తో ప్రయాణిస్తున్న బూడిద లారీల కారణంగా రోడ్లు కూడా దెబ్బతింటున్నాయని ఆరోపిస్తున్నారు. ఫ్లైయాష్ లారీల వల్ల ఎగసి పడే దుమ్ము ధూళిని అరికట్టడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
9885181097

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com